ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 15
సంచిక : 91
పేజీలు : 3

శనివారం, నవంబర్ 29, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణ

**- ఎన్నికల పరిశీలకులు కాళీచరణ్ సుదామ రావు**

**టి మీడియా, నవంబర్ 28, ఖమ్మం:**జిల్లాలో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛ, న్యాయబద్ధ నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు అన్నారు.సాధారణ ఎన్నికల పరిశీలకులు, కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూలి పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని, ఎక్కడ చిన్న పొరపాటు జరగడానికి ఆస్కారం ఇవ్వవద్దని, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణ జరగాలని స్పష్టం చేశారు. ఎం.సి.సి. నిబంధనలు ఉల్లంఘనలు జరగకుండా చూడాలని, అభ్యర్థులు వినూత్న రీతిలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తారని, దీనిని నిరోధించేందుకు పక్కా నిఘా పెట్టాలని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎక్కడా కూడా ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం కావద్దని తెలిపారు. అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా ఎన్నికల పట్ల నమ్మకం పెరుగుతుందని, చిన్న ఫిర్యాదును కూడా నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ఎన్నికలకు సంబంధించి వచ్చే వివిధ ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు డిఆర్ఓ ఆధ్వర్యంలో వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1077 పట్ల విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.నామినేషన్లు ముగిసి అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత ప్రలోభాలు పెరిగే అవకాశం ఉందని, క్షేత్రస్థాయిలో బృందాలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రచారంను తహసిల్దార్, ఆర్డిఓ రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని, కులాలు, మతాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే రికార్డు చేసి నిబంధనలను ప్రకారం వారిని పోటీ నుంచి తొలగించే అవకాశం ఉంటుందని అన్నారు.ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూలి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చాలా తీవ్రంగా ఉంటుందని, ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. కులాలు, మతాల మధ్య ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు ఉపేక్షించడం జరగదని అన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి టి. సునీల్ రెడ్డి, డిఈఓ చైతన్య జైని, సిపిఓ శ్రీనివాస్, ఆర్టీఓ వెంకట రమణ, డిసిఓ గంగాధర్, ఆర్డీఓ నరసింహా రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, డిప్యూటీ సిఈఓ నాగ పద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఈడిఎం. దుర్గాప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ కేంద్రంలో అక్రమాల పర్వం

**-దళారీ ల సరుకుకు అడ్డా**

**టి మీడియా, నవంబర్ 28 , బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలోని జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం అక్రమాలకు అడ్డాగా మారింది. కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర దక్కుతుందని ఆశగా వస్తున్న అన్నదాతలను నిలువునా మోసం చేస్తూ, దళారులకు కొమ్ముకాస్తున్న అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. ?లక్ష్మీపురం సీసీఐ కేంద్రానికి స్థానిక తెలంగాణ రైతులు పత్తిని తీసుకువస్తే తేమ శాతం ఎక్కువగా ఉందని, నాణ్యత లేదని సాకులు చెబుతూ సీసీఐ బయ్యర్ నిర్దాక్షిణ్యంగా తిరస్కరిస్తున్నారు. కానీ అదే పత్తిని రైతులు బయట దళారులకు లేదా వ్యాపారులకు అమ్ముకుని, ఆ వ్యాపారులు అదే పత్తిని కేంద్రానికి తీసుకువస్తే మాత్రం ఎలాంటి అభ్యంతరం లేకుండా కొనుగోలు చేస్తున్నారని






రైతులు ఆరోపిస్తున్నారు.

**ఆంధ్రా పత్తికి అగ్రతాంబూలం**

సరిహద్దు ప్రాంతం కావడంతో, పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ నుండి దళారులు తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి లక్ష్మీపురం కేంద్రానికి తరలిస్తున్నారు. ఇక్కడి అగ్రికల్చర్ అధికారి, సీసీఐ బయ్యర్ దళారులతో కుమ్మక్కై, కమీషన్లకు ఆశపడి ఆంధ్రా పత్తికి ఓకే చెబుతూ,స్థానిక తెలంగాణ పత్తిని రిజెక్ట్ చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై ఫిర్యాదు చేయడానికి, తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఉన్నతాధికారులకు ఫోన్లు చేసినా కనీసం స్పందించడం లేదని, ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని రైతులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలవాల్సిన వ్యవసాయ శాఖ అధికారులే వ్యాపారులతో చేతులు కలపడం గమనార్హం. సుప్రీంకోర్టుకు లెటర్ పిటిషన్ పంపనున్న జంతు ప్రేమికులు?కలెక్టర్ గారు స్పందించాలి..దళారులు, అధికారుల మాయాజాలంలో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఇకనైనా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరిపించాలని రైతులు వేడుకుంటున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న బాధ్యులపై చర్యలు తీసుకుని, తమ పత్తిని న్యాయబద్ధంగా కొనుగోలు చేసేలా చూడాలని బూర్గంపాడు మండల రైతాంగం కోరుతోంది.

## కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

**టి మీడియా, నవంబర్ 28,కొత్తగూడెం:** సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం, రుద్రంపూర్ నందు 3 రోజులపాటు నిర్వహించే కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటలు (లీగ్ కమ్ నాకౌట్) ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఎం.షాలేం రాజు అధ్యక్షతన జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా సింగరేణి డైరక్టర్ (ఆపరేషన్స్) శ్రీ ఎల్.వి.సూర్యనారాయణ పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా డైరక్టర్( పి%డ%పి) శ్రీ వెంకటేశ్వర్లు, డైరక్టర్(ఈ%డ%ఎం) ఎం.తిరుమల రావు, ఏఐటియూసి జనరల్ సెక్రటరీ కే.రాజ్ కుమార్, ఐఎన్‌టియూసి జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్, కొత్తగూడెం ఏరియా సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎం.వి.నరసింహా రావు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ %డ% సిఎస్ఆర్ శ్రీ జి.వి.కిరణ్ కుమార్ హాజరయ్యారు. ముందుగా పాఠశాల స్పోర్ట్స్ విద్యార్థులు, అతిథులని వేదిక వద్దకు



ఆహ్వానించారు. అనంతరం,జ్యోతి ప్రజ్వలనతో ముఖ్య అతిథి,సింగరేణి డైరక్టర్ (ఆపరేషన్స్) శ్రీ ఎల్.వి.సూర్యనారాయణ ఒలంపిక్ పతాక ఆవిష్కరణ చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం అతిథులు ప్రారంభ ఉపన్యాసం లో మాట్లాడుతూ... 2025-26 ఆర్థిక సంవత్సరానికి కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలను (లీగ్ కమ్ నాకౌట్) సింగరేణి కొత్తగూడెం ఏరియా నిర్వహించుకోవటం చాలా సంతోషం అని, క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని, క్రీడలు అనేవి శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ క్రీడా పోటీలలో గెలుపు ఓటములను సమానముగా తీసుకోవాలని తెలుపుతూ, ఈ పోటీలలో పాల్గొనే కోల్ ఇండియా పరిధిలోని 8 బొగ్గు సంస్థల జట్లు అయిన సింగరేణి, బిసిసిఎల్, సిసిఎల్, ఈసిఎల్, ఎన్‌సిఎల్, ఎస్ఈసిఎల్, ఎంసిఎల్, డబల్యూసిఎల్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జాగ్రతలు తీసుకుంటూ, స్నేహభావం తో ఈ 3 రోజుల కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.




## స్టేట్ ఎలక్షన్ అబ్జర్వర్ విజిట్

**టి మీడియా, నవంబర్ 28, ఇనుగుర్తి:**సర్పంచి,వార్డు సభ్యుల ఎన్నికలు పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రం లోని నామినేషన్ సెంటర్ ను స్టేట్ ఎలక్షన్స్ అబ్జర్వర్ మధుకర్ బాబు శుక్రవారం విజిట్ చేశారు.ఎంతమంది నామినేషన్ పత్రాలు అందజేశారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి జినుగు మరియన్న, తహసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# కోడ్ ఉల్లంఘించిన పైవారి కేసులు

**-దాడులకు పాల్పడుతూ**

**ఉంటే అధికారులు మౌనం**

**-జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు**



**టీ మీడియా, నవంబర్28,ములుగు బ్యూరో:** ములుగు జిల్లా షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీల పై గిరిజనేతరుల దాడులు రోజు రోజు కి పెచ్చు మీరుతున్నాయని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆరోపించింది. అబ్బాయి గూడెం ఇసుక క్వారీ పెసా చట్ట నిబంధనలకు లోబడి జరుగుతూ ఉంటే స్థానిక గిరిజనేతరులు ఉద్దేశపూర్వకంగా పనులకు అడ్డుపడుతూ అడిగిన ఆదివాసీ మహిళల పైన గత వారం రోజులుగా విచక్షణ రహితంగా దాడులు చేస్తూ ఉంటే వారి పై చర్యలు కరువయ్యాయని మండిపడ్డారు. శుక్రవారం ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు దాడికి గురైన ఆదివాసీ మహిళలు కొర్స జ్యోతి, మునీకాంత, ముర్రం వె%శీ%కటరమణ, సున్నం కుమారి, నాగమణి లను పరామర్శించారు. అనంతరం ఆదివాసీ నాయకులు కొర్స నర్సింహా మూర్తి, పూనెం రాంచందర్, ఉయిక శంకర్, పర్శిక సతీష్, సిద్దబోయిన సర్వేష్, కుచ్చింటి చిరంజీవి, పూనెం ప్రతాప్ మాట్లాడుతూస్వయం ఉపాధి పొందుతూ ఉంటే అర్హత లేని గిరిజనేతరులు భౌతిక దాడులకు పాల్పడడం అన్యాయం అన్నారు. అబ్బాయిగూడెం క్వారీని నడవకుండా ఆపితే ఊరుకునేది లేదని ఆదివాసీ సంఘాల నాయకులు హెచ్చరించారు. క్వారికి, సొసైటీ మహిళలకు పోలీస్ భద్రత కల్పించాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు దాడులకు గురైన ఆదివాసీ మహిళలకు ఆదివాసీ చట్టాలకు అండగా ఉండాలని అన్నారు. ఎన్నికల కోడ్ ని ఉల్లంఘించి ధర్నాలు చేసిన వారి పై కేసులు పెట్టాలని డిమాండ్ చేసారు. ఇదే అంశం పై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ని కలుస్తామని ఆదివాసీ సంఘాలు వెల్లడించాయి. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన గిరిజనేతరుల పైన క్రిమినల్ కేసులు పెట్టి, ఆ భూములను వెనక్కి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ని కోరినారు...అనంతరం వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతి రావు లకు ఘటన పై ఫిర్యాదు చేసారు. నాయకులు తాటి లక్ష్మణ్, ముర్రం రాజేష్ ముర్రవానిగూడెం ఆదివాసీలు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న నామినేషన్లు..

**ఇనుగుర్తి సర్పంచి 24,వార్డు 14**

**నెల్లికుదురు సర్పంచి 65,వార్డు 57**





**టి మీడియా నవంబర్ 28 ఇనుగుర్తి/నెల్లికుదురు:**స్థానిక సంస్థల ఎన్నికల పురస్కరించుకొని సర్పంచి, వార్డు సభ్యుల నామినేషన్లు రెండవ రోజు శుక్రవారం కొనసాగాయి. ఇనుగుర్తి మండలం ఇనుగుర్తి మండలంలో నామినేషన్ల వివరాలు ఎంపీడీవో పార్థసారధి తెలిపారు.శుక్రవారం వివిధ గ్రామాల నుంచి సర్పంచ్ 24,వార్డు సభ్యులు16 నామినేషన్లు వచ్చాయన్నారు. ఇనుగుర్తి సర్పంచి మూడు1 వార్డ్ మెంబర్ 8, లాలు తండా1-2, రాము తండ0-1, అయ్యగారి పల్లి1-0, కోమటిపల్లి3-0, పాత తండా1-1, తారా సింగ్ తండా1-0, చిన్ననాగారం1-1, మీట్యాతండ2-0,చిన్న ముప్పారం9-0,లక్ష్మీపురం1-0, పెద్ద తండ (సిఎం)1-0.

**నెల్లికుదురు మండలం**

నెల్లికుదురు మండలంలో గురు శనివారాలలో సర్పంచి 65,వార్డు మెంబర్లు 57 నామినేషన్లు అందినట్లు ఎంపీడీవో సింగారపు కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రబెల్లి గూడెం సర్పంచ్ 4,వార్డు సభ్యులు3, బడి తండ1-0, నెల్లికుదురు3-1, బ్రాహ్మణ కొత్తపల్లి1-0,రామన్నగూడెం3-1 నైనాల2-0, జామ తండ4-5, నల్లగుట్ట తండ1-0, హనుమాన్ నగర్ తండ2-0, రాజుల కొత్తపల్లి1-0,పార్వతమ్మ గూడెం2-0,రావిరాల3-3, దుర్గ భవాని తండ4-3, వస్రాం తండా2-0,మునిగలవీడు5-11, శ్రీరామగిరి3-5, నరసింహుల గూడెం3-8,కాస్య



తండ3-2,బంజర3-9, వావిలాల5-1, ఆలేరు5-1, బోటి మీది తండ2-4, రాజ్య తండా3-0.కాగాకాచికల్, మేచరాజుపల్లి, పెద్దతండ, సొల్లతండ, సీతారామపురం, మదనతుర్తి, హేమ్లతండ గ్రామాల నుంచి ఇంతవరకు నామినేషన్లు రాలేదని తెలిపారు.

## నివాస ప్రాంతాల్లో వైన్ షాపు

**-నిలిపివేయాలని వినతి**



**టి మీడియా, నవంబర్ 28, మధిర :** మధిర పట్టణంలోని నివాస ప్రాంతంలో వైన్ షాపుల ఏర్పాట్లను నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌కు, ఎక్సైజ్ ఎస్ఐ కు స్థానిక మహిళలు శు క్రవారం వినతి పత్రం అందజేశారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి కొత్తగా వైన్ షాపులు దక్కించుకున్న యజమానులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ముందస్తుగా వైన్ షాప్ లైసెన్స్ దారులకు సమాచారం ఇచ్చి వాటిని జన నివాసం లేని ప్రాంతాల్లో ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్తామని తెలిపారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన పరిశీలకుడు సర్వేశ్వర్ రెడ్డి



**దుమ్ముగూడెం:**జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ఈ క్రమంలో, దుమ్ముగూడెం మండలం పర్వతాల, పెద్దనల్లబల్లి, ప్రగలపల్లి గ్రామ పంచాయతీలు, చెర్ల మండలం దేవరపల్లి, ఆర్.కొత్తగూడెం, పెద్దమిడసలేరు గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సాధారణ ఎన్నికల పరిశీలకులుసర్వేశ్వర్రెడ్డి శుక్రవారం పరిశీలించారు.పరిశీలనలో ప్రతి కేంద్రంలో అభ్యర్థుల సౌకర్యాలు, కేంద్ర పరిసరాల శుభ్రత, ధృవపత్రాల సమర్పణ విధానం, సిబ్బంది సమర్థత, వరుసల ఏర్పాట్లు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా, సర్వేశ్వర్ రెడ్డి, గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో తమ విధులు నిర్వహించాలన్నారు.అభ్యర్థులు తమ దాఖలాలను నియమావళి ప్రకారం సమర్పించడం, కేంద్ర సిబ్బంది ప్రతి దశలో సమర్థంగా విధులు నిర్వర్తించడం ద్వారా, జిల్లా మొత్తం నామినేషన్ ప్రక్రియ సక్రమంగా, సమస్యలు లేకుండా సాగుతుందని పరిశీలకులు అన్నారు.ఈ పరిశీలనలో సంబంధిత మండలాల ఎంపీడీవోలు తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నారైకు పాస్‌బుక్ జారీ

**టి మీడియా, నవంబర్ 28, ఖమ్మం రూరల్ :** ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఆదేశాలతో తాసీల్దార్ రాంప్రసాద్ మూడు రోజుల్లో ఎన్నారై కు పాస్ బుక్స్ జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన పసుపులేటి రాజగోపాల్ అమెరికాలో స్థిరపడ్డాడు. ఇతనికి ఏదులాపురం రెవెన్యూలోని సర్వే నంబర్ 19లో గుంట, సర్వే నంబర్ 20లో 31 గుంటలు, సర్వే నంబర్ 327లో 20 గుంటల భూమి ఉంది. దీనికోసం తను ఎన్నారై పోర్టల్ నుంచి 2022లో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ దీనిపై అధికారుల స్పందన లేకపోవడంతో అది అలాగే తాసీల్దార్ లాగిన్‌లో ఉండిపోయింది. ఈ నేపథ్యంలో సదరు ఎన్నారై జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిసెట్టికి వాట్సాప్ ద్వారా తన పరిస్థితిని విన్నవించాడు.



## దార్శనికుడు జ్యోతిరావు పూలే

**టి మీడియా, నవంబర్ 28, ఇనుగుర్తి:**సమసమాజ స్థాపన కోసం,బడుగు బలహీన వర్గాల విద్యావ్యాప్తి కోసం కృషి చేసిన ప్వుడు జ్యోతిరావు పూలే వర్ధంతి మండల కేంద్రం ఇనుగుర్తి లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.సంఘం అధ్యక్షులు పప్పుల వెంకన్నతో పాటు పలువురు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు పూలే సామాజిక సేవా కార్యక్రమాలను,పేదల కోసం ఉద్యమించిన తీరును గుర్తుచేస్తూ ప్రశంసించారు.కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులతో పాటు తమ్మడపల్లి కుమార్,దార్ల రామ్మూర్తి, బేతమల్ల చంద్రయ్య,గండు నాగయ్య,పింగిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**పంటలను నాశనం**

## చేయొద్దన్న రైతులు

**-దాడికి పాల్పడిన ఇసుక క్వారీ నిర్వాహకులు**

**టీ మీడియా ,నవంబర్ 28 , ములుగు :** ఇసుక మాఫియా ఆగడాలు రోజురోజుకు శృతిమించి పోతున్నాయి. ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతూ ప్రాణాలు సైతం తీస్తున్నారు. తాజాగా ములుగు జిల్లాలో ఇసుక క్వారీ నిర్వాహకులు రైతులపై దాడి చేయడం కలకం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపురం నూగూరు మండల పరిధిలోని అబ్బాయిగూడెంలో ఇసుక లారీల కారణంగా మిర్చి తోటలు దెబ్బతింటున్నాయని లారీలను రైతులు అడ్డుకున్నారు. దీంతో ఇసుక సొసైటీ సభ్యులకు, గ్రామస్తులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇసుక క్వారీని నిలుపుదల చెయ్యాలని డిమాండ్ చేస్తూ ప్రధాన రహదారిపై గ్రామస్తులు, రైతులు రాస్తారోకో చేస్తుండగా మహిళలతో పాటు రైతులపై ఇసుక క్వారీ నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఓ మహిళ సొమ్ముసొల్లి పడిపోయింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## బీఆర్ఎస్ లోకి కాంగ్రెస్ జోగ్గూడెం ఉపాధ్యక్షుడు

**టి మీడియా, నవంబర్ 28, కామేపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగ్గూడెం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జర్పుల రాజేశ్ నాయక్ బీఆర్ఎస్ పార్టీలో చేరాడు. టేకులపల్లి పార్టీ కార్యాలయంలో జర్పుల రాజేశ్‌కు మాజీ ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బట్టు శంకర్ నాయక్, భగవాన్ నాయక్, రావొజీ రావు, జోగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు మోతిలాల్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ వ్యాధిని ముందుగానే గుర్తిస్తే నియంత్రణ సాధ్యమే

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

**టి మీడియా, నవంబర్ 28, దుమ్ముగూడెం**

సికిల్ సెల్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నియంత్రణ సాధ్యమేనని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆరోగ్యవంతమైన, సికిల్ సెల్ తల సేమియా లేని జిల్లాగా మార్చే దిశగా బ్లడ్ వారియర్స్ ఫౌండేషన్, రాష్ట్ర ప్రభుత్వం సిఎస్ఐఆర్, సీసీఎంబి తపాడియా డయాగ్నస్టిక్స్, సోషల్ వెంచర్ పార్ట్నర్స్ ఇండియా సంస్థలతో కలసి మారాయి గూడెం, నర్సాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని, అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. మారాయి గూడెం గ్రామంలో 120 ముందుకి సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సికిల్ సెల్, తలసేమియా ముందుగానే గుర్తించడం అత్యంత కీలకమని, రక్తహీనత లక్షణాలు కనిపించిన ప్రతి ఒక్కరూ తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నరసాపురం శిబిరంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని ఉచిత రక్తపరీక్షలు, వైద్యుల సలహాలు మరియు అవసరమైన మందులు పొందారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్, జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్, జిల్లా సికిల్ సెల్ ప్రోగ్రాం అధికారి మధువరన్, అడ్వైజర్ రఘు మంగరాజు, బ్లడ్ వారియర్స్ గిరి రాజ్ చందక్, కృష్ణవంశీ, సందీప్, ఎంపీడీవో వివేక్ రామ్, వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.





## లైసెన్సు లేని పత్తి వ్యాపారులకు జరిమానా

**టీ మీడియా, నవంబర్ 28, సింగరేణి ( కారేపల్లి):** సింగరేణి మండలం కారేపల్లి లో లైసెన్స్ లేకుండా పత్తి వ్యాపారం చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఏఎంసి 3 గ్రేడ్ కార్యదర్శి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేయడం జరిగింది. ఖమ్మం కు చెందిన ధాన్యం వ్యాపారి కె వెంకటరమణ దగ్గర మార్కెట్ ఫీజు రూ.2800 వసూలు చేయడం జరిగిందని, అలాగే లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నందుకు గాను రూ. 10,000 ఫైన్ వేయడం జరిగిందని నరేష్ కుమార్ తెలియజేశారు. ఈ దాడులలో సిబ్బంది సిహెచ్ లక్ష్మయ్య, జి.రంజిత్, వై.మధు, ఐ.సందీప్, ఈ. రమేష్ లు పాల్గొన్నారు.

## సీతారామపురం రిజర్వేషన్ మార్చాలి

### - ఎన్నికల సంఘానికి అభ్యర్థన



**టి మీడియా, నవంబర్ 28 ,నెల్లికుదురు:**మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన సర్పంచి రిజర్వేషన్ ఎస్ టి ని జనరల్,లేనిపక్షంలో బీసీ కేటగిరీగా మార్చాలని కోరుతూ గ్రామస్తుల తరపున తాడూరి సంపత్ స్టేట్ ఎన్నికల కమిషన్ కుముదిని ని శుక్రవారం అభ్యర్థించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 728 ఓట్లు ఉండగా, అందులో బిసి, ఒసి ల ఓట్లు 599, ఎస్సీ 129 ఉన్నాయని తెలిపారు. గ్రామంలో ఎస్టీ ఓట్లు లేవని పేర్కొన్నారు. ఈ గణాంకాల ప్రకారం గ్రామానికి యు ఆర్(అన్‌రిజర్వ్డ్) కేటాయించాలని కోరారు. బీసీ,ఒసి వర్గాల ఆధిక్యం ఉన్న గ్రామంలో రిజర్వేషన్‌ను మార్చడం ప్రజాస్వామ్య న్యాయానికి వ్యతిరేకమని గ్రామస్తులు పేర్కొంటూ, రిజర్వేషన్ కేటాయింపును వెంటనే మార్చి సరైన కేటగిరీ కేటాయించాలని ఎలక్షన్ కమిషన్‌ను కోరారు.

## మండల స్థాయి ఒలింపియాడ్, ఎడ్యుకెస్ట్‌లో
## సత్తా చాటిన బాలికోన్నత పాఠశాల విద్యార్థులు

**టి మీడియా, నవంబర్ 28, అశ్వారావుపేట**

ఈఎల్టీఏ (ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో మండల స్థాయిలో శుక్రవారం జరిగిన ఒలింపియాడ్ - ఎడ్యుక్వెస్ట్ పోటీలలో అశ్వారోవుపేట బాలికోన్నత పాఠశాల విద్యార్థినిలు తమ సత్తా చాటారు. మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సీనియర్ విభాగం (ఇంగ్లీష్ ఒలింపియాడ్)లో 9వ తరగతి విద్యార్థిని ఎస్కే జాస్మిన్, జూనియర్స్ విభాగంలో 8వ తరగతి విద్యార్థిని జాహ్నవి సీతాకుమారి ఎడ్యుకెస్ట్ సీనియర్ విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కే.సుమన శ్రీ, జూనియర్స్ విభాగంలో 7వ తరగతి విద్యార్థిని టీ.నీలిమలు ప్రథమ బహుమతులు సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను ప్రోత్సహించి, మంచి ఫలితాలు రావడానికి కృషి చేసిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు నర్మదను ప్రధానోపాధ్యాయులు నల్లపు కొండల రావు అభినందించారు.

## పర్యావరణం కోసం
## గ్రీన్ భద్రాద్రి చేస్తున్న సేవలు ప్రశంసనీయం

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి

**టి మీడియా, నవంబర్ 28, భద్రాచలం**

గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో భద్రాచల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మొక్కలు నాటడం అనేది గొప్ప విషయమని, గ్రీన్ భద్రాద్రి వారు గత పద్నాలుగు సంవత్సరాలుగా నిరంతరంగా మొక్కలు నాటుతూ, వాటిని సంరక్షిస్తూ, పట్టణంలో పచ్చదనాన్ని, ఆహ్లాద కరమైన వాతావరణం పంచుతున్నారని, ఈ మహోన్నత కార్యక్రమం వెనుక ఎంతో శ్రమ కష్టం ఉన్నాయని, విద్యార్థులు సైతం మొక్కలు నాటి, పర్యావరణ అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టే లలిత, కళాశాల గ్రీన్ భద్రాద్రి పూర్వ అధ్యక్షులు జి.ఎస్ శంకరరావు, డా.గోళ్ళ భూపతి రావు, గ్రీన్ భద్రాద్రి కో ఆర్డినేటర్ పామరాజు తిరుమలరావు, కళాశాల ఉపన్యాసకులు భారతి, రాజేశ్వరి, సామ్రాజ్యం, రత్నం, గరుడాచలం పాల్గొన్నారు.



## తెలంగాణ ఆవిర్భావానికి స్ఫూర్తి

### కేసీఆర్ దీక్ష దివస్ - మాజీ ఎంపీ నామ

**టి మీడియా, నవంబర్ 28, ఖమ్మం :**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన దీక్ష దివస్ ఉద్యమం ఈ తరం మాత్రమే కాదు, రాబోయే తరాలు కూడా స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందని, ఉద్యమానికి కొత్త దిశ ఇచ్చిన మహోన్నత ఘట్టం దీక్ష దివస్ అని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ధ్యేయంతో ఆమరణ నిరాహార దీక్షకు దిగిన కేసిఆర్, "తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో" అంటూ నినాదంతో 29 నవంబర్ కేసీఆర్ చేపట్టిన దీక్ష దివస్, రాష్ట్ర ప్రజల కలల్ని నిజం చేసిన ప్రజా పోరాట దినంగా నిలిచిపోయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాత్రింబవళ్ల నాడు పోరాడిన తెలంగాణ విద్యార్థి లోకం, ఉద్యమకారులు, ఉద్యోగులు, అమరులు త్యాగాలు ఎన్నటికీ మరువలేమన్నారు. దీక్ష దినోత్సవం సందర్భంగా ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త ఉద్యమ చరిత్రను గుర్తుచేసుకుని, ప్రజల మధ్యకు వెళ్లి దీక్ష ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. కే కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా చర్యలు

- ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రోహిత్ రాజు

**టి మీడియా, నవంబర్ 28, కొత్తగూడెం**



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులందరూ బాధ్యతగా తమ విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఓటర్లను నగదు, మద్యం, ఇతర వస్తువులతో ప్రలోభ పెట్టే వారిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద కేసులు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

**పదోన్నతులు బాధ్యతలను పెంచుతాయి - ఎస్పీ రోహిత్ రాజు**

హెడ్ కానిస్టేబుళ్ళుగా పదోన్నతిని పొంది జిల్లాకు కేటాయించబడిన 14 మంది అధికారులు ఎస్పీ రోహిత్ రాజుని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 1998 బ్యాచ్‌లో కానిస్టేబుళ్ళుగా భర్తీ అయ్యి ఇటీవల పదోన్నతి పొంది ఖమ్మం జిల్లా నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీపై రిపోర్ట్ చేసిన 14 మంది హెడ్ కానిస్టేబుల్ అధికారులను ఎస్పీ అభినందించారు. పోలీస్ శాఖలో పదోన్నతులు తమ బాధ్యతలను మరింతగా పెంచుతాయని అన్నారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతతో వ్యవహరించే వారికి ఎప్పటికైనా పోలీస్ శాఖలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తూ తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని వారికి సూచించారు.




## సాధన చేసి తిరిగి విజేతలుగా నిలవాలి

### -ఎమ్మెల్యే పద్మావతి

**టి మీడియా, నవంబర్ 28, కోదాడ:** క్రీడల్లో ఓటమి చెందిన క్రీడాకారులు ఓటమికి కుంగి పోకుండా తిరిగి సాధన చేసి విజేతలుగా నిలవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని సిసిఆర్ విద్యానిలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 19వ సిఎస్ఏ జాతీయ స్థాయి క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. కాగా గత నాలుగు రోజులుగా హోరీగా జరిగిన జాతీయ స్థాయి క్రీడలకు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి 29 పాఠశాలల నుండి 1450 మంది కబడ్డి, వాలీబాల్, హ్యాండ్ బాల్, త్రో బాల్, బాస్కెట్ బాల్, స్పోర్ట్స్ ఈవెంట్స్ లో ప్రాతినిధ్యం వహించారు.ప్రోవిన్షియల్ సుపీరియర్ ఉడుముల శౌరీలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ సుపీరియర్ జనరల్ సిస్టర్ ఆల్ఫోన్సా, సిస్టర్ నక్షత్రం, సిస్టర్ శాంతా మేరీ, సిస్టర్ ఇరుదయం జూలియట్, సిస్టర్ విజయ ఫాదర్ ఫజోసాఫ్ రెడ్డి పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ అన్ జ్యోతి, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఎంఈఓ సలీం షరీఫ్,బాల్ రెడ్డి, సుందరి వెంకటేశ్వర్లు, లామ్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



**టి మీడియా, నవంబర్ 28,భద్రాచలం:** భద్రాచలంలో జరిగిన సైబర్ నేరంను ఆ తర్వాత తీసుకున్న చర్యలను భద్రాచలం ఎస్పి క్రాంతి కుమార్ సింగ్ ఒక ప్రకటన ద్వారా పత్రికలకు విడుదల చేశారు. భద్రాచలం పట్టణానికి చెందిన ఒక వ్యక్తికి మూడు నెలల క్రితం ఫేస్‌బుక్‌లో ఒక మహిళ పరిచయమైంది. ఆమె %టఐఅఖ్రీ- శీస్త్రశ్రీశీఝశ్రీశ్రీ.ఎశీఎ% లింక్‌లో వ్యాపారం చేస్తున్నానని, అధిక లాభాలు ఆర్జిస్తున్నానని చెప్పి అతన్ని మోసం చేసింది. ఆమె తాను వ్యాపారం చేసిన లింక్‌లో తనను కూడా వ్యాపారం చేయమని కోరింది.దీనికి ప్రతిస్పందనగా, అతను మొదట ఆమె చెప్పిన లింక్‌లో రూ. 50,000 వ్యాపారం చేయగా, అతనికి దాదాపు రూ. 15,000 లాభం చూపించారు. ఆ విధంగా, మీరు పెద్ద మొత్తంలో చేస్తే, తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు అని చెప్పి అతనితో పలు దఫాలుగా రూ. 32 లక్షలు పెట్టుబడి పెట్టించి అతన్ని మోసం చేసింది. మోసపోయానని గ్రహించి వెంటనే 1930 సైబర్ క్రైమ్ కు కాల్ చేసి ఈ సంఘటన గురించి చెప్పాడు.తరువాత నవంబర్ 27 తేదీన అతను భద్రాచలం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఈ విషయంపై ఫిర్యాదు చేశాడు. భద్రాచలం టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెట్టుబడి పెట్టే ముందు వొకటికి రెండుసార్లు ఆలోచించాలని, పెట్టుబడి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాట్సాప్ , టెలిగ్రామ్ గ్రూపులలో తెలియని వ్యక్తులు పోస్ట్ చేసే స్క్రీన్‌షాట్‌లు , ప్రకటనలకు మోసపోవద్దని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే, వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కి లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయండి, మేము మీకు వెంటనే న్యాయం చేస్తామని ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు.